సాక్షి అనకాపల్లి

ఆదివారం । 21 । సెప్టెంబర్ । 2025



శ్రీరామ నీనామమెంతో రుచిరా..

త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ ఆధ్వర్యంలో కళాభారతి ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన శ్రీరామగానామృతం కార్యక్రమం వీనులవిందుగా సాగింది. ఐవీఎల్ శాస్త్రీయ సంగీత సభ ఉపాధ్యాయుడు ఆకొండ వెంకటరావు ఆధ్వర్యంలో 80 మంది కళాకారులు ఒకే వేదికపై రామనామ గానం చేసి ప్రేక్షకులను అబ్బురపరిచారు. కళాభారతి ట్రస్ట్ అధ్యక్షుడు ఎం.ఎస్.ఎన్.రాజు, కార్యదర్శి గుమ్ములూరి రాంబాబు, పైడా కృష్ణప్రసాద్ ఈ కార్యక్రమానికి అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. గంటన్నరపాటు సాగిన ఈ కార్యక్రమం ఆహూతులను భక్తి పారవశ్యంలో మునిగేలా చేసింది. -మద్దిలపాలెం (విశాఖ)

నిరసన ఫుల్.. రిజిస్ట్రేషన్లు నిల్

రిజిస్ట్రార్ ఆఫీసులు.. నిత్యం కిటకిటలాడే కార్యాలయాలు.. కాసుల గలగల వినిపించే ప్రదేశాలు.. రెండు రోజులుగా వెలవెలబోతున్నాయి. అక్కడి కార్యకలాపాల్లో కీలక పాత్ర పోషించే డాక్యుమెంటు రైటర్లు తమ డిమాండ్ల సాధనకు పెన్ డౌన్ చేయడమే ఇందుకు కారణం. జిల్లాలో రోజుకు రూ.కోటికి పైగా ఆదాయం తెచ్చే శాఖకు రెండు రోజుల్లో కేవలం రూ.5.75 లక్షలు మాత్రమే వచ్చిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

- డాక్యుమెంట్ రైటర్ల పెన్ డౌన్ ఎఫెక్ట్
- వెనుదిరుగుతున్న ప్రజలు
- వెలవెలబోతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు
- రెండు రోజుల్లో భారీగా తగ్గిన ప్రభుత్వ ఆదాయం
- కొత్త విధానాలతో కూటమి ప్రభుత్వం వేధిస్తోందని లేఖర్ల ఆందోళన



కోటవురట్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిరసనలో పాల్గొన్న డాక్యుమెంట్ రైటర్లు

సాక్షి, అనకాపల్లి/చోడవరం/అనకాపల్లి టౌన్:

రిజిస్ట్రేషన్ల కోసం వస్తున్న ప్రజలు నిరాశతో వెనుదిరుగుతున్నారు. మంచి రోజని రిజిస్ట్రేషన్ పని పెట్టుకున్నవారు, ఇందుకోసం ఎక్కడెక్కడి నుంచో వస్తున్నవారు ఉసూరుమంటున్నారు. కూటమి ప్రభుత్వ వైఖరితో విసిగిపోయిన డాక్యుమెంట్ రైటర్లు అన్ని చోట్లా ఆందోళనకు దిగారు. పెన్ డౌన్ పేరిట పనులు నిలిపివేసి శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్నారు. శుక్రవారం వీరి ఆందోళన ప్రారంభం కాగా రెండు రోజుల్లోనే కార్యకలాపాలు స్తంభించిపోయాయి. జిల్లాలో అనకాపల్లి, యలమంచిలి, నక్కపల్లి, సబ్బవరం, కోటవురట్ల, నర్సీపట్నం, మాడుగుల, చోడవరం, కె.కోటపాడు, లంకెలపాలెంలలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 5 వేలమంది డాక్యుమెంట్ రైటర్లు, రైటర్ అసిస్టెంట్లు, ఆపరేటర్లు, ఇతర సిబ్బంది ఉన్నారు. జిల్లావ్యాప్తంగా శుక్ర, శనివారాలలో జరిగిన రిజిస్ట్రేషన్ల ద్వారా 5 లక్షల 75 వేల ఆదాయం వచ్చినట్లు జిల్లా రిజిస్ట్రార్ మన్మధరావు 'సాక్షి'కి తెలిపారు. జిల్లాలో ఉన్న 10 రిజిస్ట్రేషన్ కార్యాలయాలలో శుక్రవారం 37, శనివారం 61 రిజిస్ట్రేషన్లు జరిగాయన్నారు. సాధారణంగా రోజుకు సరాసరి 220 నుంచి 240 వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతాయని, కోటి నుంచి కోటీ పది లక్షల రూపాయల వరకు ఆదాయం ప్రభుత్వానికి వస్తుందన్నారు. రెండు రోజుల్లో రూ.2 కోట్లకు పైగా రావలసిన ఆదాయం రూ.5.75 లక్షలకు పడిపోయిందంటే ప్రభావం ఏమేరకు ఉందో అర్థమవుతోంది.

ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినా..

దస్తావేజు లేఖర్లు చేస్తున్న సమ్మె వలన ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయంగా కార్యాలయ సిబ్బందితో దస్తావేజులు రాయడానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాట్లు చేశారు. అయితే ప్రజలెవరూ వీరిని ఆశ్రయించలేదు. శుక్ర, శనివారాల్లో అనకాపల్లిలో ఒక్క రిజిస్ట్రేషన్ జరగలేదని జాయింట్ సబ్ రిజిస్ట్రార్ పి.వి.ఎస్.మాధవి కుమారి తెలిపారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి..

కూటమి ప్రభుత్వంలో రిజిస్ట్రార్ కార్యాలయాలు కళ తప్పాయి. ఇప్పటికే రియల్ ఎస్టేట్ వ్యాపారం పతనం కావడంతో క్రయవిక్రయాలు క్షీణించాయి. కూటమి ప్రభుత్వ హయాంలో తమ కార్యకలాపాలు కుప్పకూలిపోయాయని రియల్టర్లు వాపోతున్నారు. పెట్టిన పెట్టుబడి రాకపోగా వడ్డీలు కట్టలేక అప్పుల పాలై గగ్గోలు పెడుతున్నారు. ఇలాంటి పరిస్థితిలో డాక్యుమెంట్ రైటర్ల ఆందోళన గోరుచుట్టుపై రోకటి పోటులా మారింది.

సర్వత్రా నిరసన

జిల్లా కేంద్రం అనకాపల్లిలో దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అయోధ్యశేషు, ఆనంద్ ప్రసాద్‌ల ఆధ్వర్యంలో జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఆవరణలో రెండవ రోజైన శనివారం పెన్ డౌన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత పద్ధతుల్లోనే రిజిస్ట్రేషన్లు జరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు. చోడవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద పనిచేస్తున్న దస్తావేజు లేఖర్లు శనివారం ధర్నా చేశారు. ఓటీపీ విధానం అనేక సైబర్ నేరాలకు దారితీసే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. ఈ ఆందోళనలో సంఘ గౌరవ అధ్యక్షుడు సీతారామయ్య, ఉపాధ్యక్షుడు బొబ్బిలి చంద్రశేఖర్, కార్యదర్శి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.



చోడవరంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దస్తావేజు లేఖర్లు

డాక్యుమెంట్ రైటర్ల అభ్యంతరాలేమిటి..

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త విధానాల వల్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ క్లిష్టంగా మారిందని డాక్యుమెంట్ రైటర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రిజిస్ట్రేషన్‌కు డాక్యుమెంట్ సిద్ధం చేసే సమయంలో భూమి విక్రయించే వారు మూడుసార్లు ఓటీపీ చెప్పాల్సి వస్తోంది. కొందరు విక్రయదారులు ఓటీపీ చెప్పడానికి సంకోచిస్తున్నారు. మరికొందరు చదువుకోకపోవడంతో తెలియడం లేదు. వృద్ధులు, మొబైల్స్ లేని వారు చెప్పడమే లేదు. దీంతో డాక్యుమెంట్ నిలిచిపోతుంది. ఇదే కాకుండా తీవ్ర సాంకేతిక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆధార్ ఆధారిత ఓటీపీ సెల్‌ఫోన్‌కు వచ్చే లోపు టైమ్ అవుట్ అవుతుండడంతో మళ్లీ మొదటి నుంచి రావాల్సి వస్తోంది. ఇలా ఒక డాక్యుమెంట్ కోసం మొత్తం 7 ఓటీపీలు వచ్చేలోపు దాదాపు 30-45 నిమిషాల సమయం పడుతుంది. అలాగే పీడీఈ (పబ్లిక్ డేటా ఎంట్రీ) విధానాన్ని కూడా పూర్తిగా రైటర్ చేయాల్సి వస్తోంది. దీనిని సబ్ రిజిస్ట్రార్ తన లాగిన్లో చేసుకోవాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదంటూ డాక్యుమెంట్ రైటర్లు వాపోతున్నారు. దీంతో పీడీఈ నమోదులో తీవ్ర తప్పులు, అలసత్వం నెలకొంటోంది. మరోవైపు మ్యుటేషన్ ప్రక్రియను కూడా రైటర్లే పూర్తి చేయాలని సూచిస్తుండడంతో ఏమైనా తప్పులు దొర్లితే తాము బాధ్యులు కావాల్సి వస్తోందని రైటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్లు, వారి సిబ్బంది చేసుకోవాల్సిన పనులను తమతో చేయిస్తుండడంతో తీవ్ర పనిభారం, సమయం వెచ్చించాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. ఆయా సమస్యలను పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో పెన్‌డౌన్‌కు సిద్ధమయ్యారు.

ఎడిట్ చేయడానికి వీల్లేకపోవడంతో ఇబ్బందులు..

రిజిస్ట్రేషన్‌కు ముందు విక్రయదారులు, కొనుగోలుదారుల నుంచి సమాచారం తీసుకుని.. ఆధార్ ఓటీపీ విధానం పూర్తయిన తరువాత డాక్యుమెంట్ తయారుచేస్తున్నాం. అది సబ్ రిజిస్ట్రార్ ముందుకు వెళ్లినప్పుడు ఏదైనా పొరపాటు ఉంటే ఎడిట్ చేసుకునేందుకు వెసులుబాటు లేదు. పొరపాటు జరిగితే ఆరోజు స్లాట్‌తో పాటు డాక్యుమెంట్, రిజిస్ట్రేషన్ ఆగిపోయినట్లే.

– జి.రాజులునాయుడు, డాక్యుమెంట్ రైటర్, కోటవురట్ల

నిలిచిన భూమి రిజిస్ట్రేషన్లు, పత్రాల ధ్రువీకరణ

పాతబడిన నియమాలను నవరించాలని, సాఫ్ట్‌వేర్, ఓటీపీ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నాం. క్షేత్రదారులు, లేఖర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలన్నదే మా ఉద్దేశం. మా ఆందోళనతో భూమి రిజిస్ట్రేషన్లు, పత్రాల ధ్రువీకరణ వంటి పనులు నిలిచిపోతాయి. మా డిమాండ్లు, ప్రజల సమస్యలను ప్రభుత్వం గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలి.

–నున్నం చిదంబర స్వామి, దస్తావేజు లేఖర్ల సంఘం అధ్యక్షుడు, నర్సీపట్నం

చలో మెడికల్ కళాశాల విజయవంతం



అన్నంరెడ్డి అదీప్‌రాజ్

పెందుర్తి: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ చేపట్టిన 'చలో మెడికల్ కళాశాల' కార్యక్రమం విజయవంతమైందని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్, పెందుర్తి సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా తరలిరావడంతో కూటమి ప్రభుత్వానికి ఏమీ పాలుపోవడం లేదన్నారు. పోలీసుల అడ్డంకులను దాటుకొని ప్రజలు స్వచ్ఛందంగా తరలి వచ్చారని, మెడికల్ కాలేజీలు పూర్తి కాలేదనే నాయకుల అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు మెడికల్ కాలేజీల వద్దకు వెళ్లి ఫొటోలు, వీడియోలు ప్రదర్శించారన్నారు. ఇప్పటికైనా మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరిస్తూ ఇచ్చిన జీవోను తక్షణం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో గిరిజన ప్రాంతంలో 500 పడకలతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిందని, 70 శాతం పనులు పూర్తయ్యాయన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో పలువురికి చోటు

సాక్షి, అనకాపల్లి: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో వివిధ హోదాలలో పలువురికి చోటు కల్పించారు. పార్టీ రాష్ట్ర బీసీ సెల్ ప్రత్యేక అధికార ప్రతినిధిగా పోతల లక్ష్మీ శ్రీనివాసరావు (చోడవరం), రాష్ట్ర మున్సిపల్ వింగ్ జాయింట్ సెక్రటరీలుగా కోనేటి రామకృష్ణ (నర్సీపట్నం), తమరాన అప్పలనాయుడు (నర్సీపట్నం), రాష్ట్ర సోషల్ మీడియా వింగ్ ప్రత్యేక అధికార ప్రతినిధిగా కర్రి నరసింగ్‌రావు (పెందుర్తి), రాష్ట్ర సోషల్ మీడియా వింగ్ జాయింట్ సెక్రటరీగా శెశెట్టి సోమశేఖర్ (పెందుర్తి), రాష్ట్ర ఎస్సీ సెల్ సెక్రటరీగా ఈర్లి సుధీర్ కుమార్(నర్సీపట్నం), రాష్ట్ర వలంటీర్ వింగ్ జాయింట్ సెక్రటరీగా భీమిరెడ్డి గోవింద్ (నర్సీపట్నం), రాష్ట్ర ఇంటలెక్చువల్ ఫోరం జాయింట్ సెక్రటరీగా చెరుకూరు సత్యనారాయణ (నర్సీపట్నం)లను నియమించారు. ఈ మేరకు శనివారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు.



అల్లూరి విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న డీఐజీ గోపీనాథ్ జట్టి, ఎస్పీ తుహిన్ సిన్హా

ఆదర్శప్రాయుడు అల్లూరి

- మన్యం వీరుడి పేరిట గ్రంథాలయం నడపడం గొప్ప విషయం
- విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి

IIలో

ఏటికొప్పాక కళాకారుడికి లేపాక్షి పీపుల్స్ చాయిస్ అవార్డు

యలమంచిలి రూరల్: లేపాక్షి సావనీర్ హ్యాండీక్రాఫ్ట్ డిజైన్-2025 పోటీల్లో జిల్లాకు చెందిన ఏటికొప్పాక హస్తకళాకారుడు పెదపాటి సుబ్రహ్మణ్యం ఏసుదాసు పీపుల్స్ చాయిస్ అవార్డ్ దక్కించుకున్నారు. ఇటీవల రాష్ట్ర లేపాక్షి హస్తకళలు, ఏపీ హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా హస్తకళాకారులు తమ నైపుణ్యంతో రూపొందించిన కళాకృతులను ప్రదర్శించారు. వీటిలో ఏటికొప్పాకకు చెందిన ఏసుదాసు ప్రదర్శించిన లక్కబొమ్మలతో తయారుచేసిన పచ్చదనం వెర్సస్ కాలుష్య నియంత్రణ కళాఖండానికి ఈ అవార్డు లభించింది. రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ ఎండీ శ్రీవిశ్వ నుంచి ఏసుదాసు ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఏటికొప్పాక జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి, వైఎస్సార్‌సీపీ నాయకుడు సేనాపతి రాము, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఏసుదాసును అభినందించారు.



పచ్చదనం.. కాలుష్య నియంత్రణ సూచించే బొమ్మ



అవార్డు అందుకుంటున్న ఏసుదాసు

న్యాయం కావాలి



వాడనర్సాపురం పైడమ్మ చెరువు

- పైడమ్మ చెరువును కట్టబెట్టి మా పొట్ట కొట్టకండి
- చెరువును నేవీకి అప్పగిస్తే మేం ఎలా బతకాలి?
- ఇప్పటికే హైకోర్టుకు వెళ్లిన కొత్తపేట సర్పంచ్
- తాజాగా వాడనర్సాపురం మత్స్యకార ప్రతినిధులు

గంగపుత్రులకు అడుగడుగునా అన్యాయం జరుగుతోంది. అభివృద్ధి పేరిట జరుగుతున్న కార్యకలాపాల వల్ల జరిగే మేలు ప్రజలకో.. ప్రభుత్వ పెద్దలకో తెలీదు గానీ మత్స్యకారులకు మాత్రం తీరని వేదన మిగులుతోంది. నక్కపల్లి మండలం రాజయ్యపేట, అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లోని పలు మత్స్యకార గ్రామాల వారు ఒకపక్క ఆందోళనలు చేస్తుండగా.. పైడమ్మ చెరువు వివాదం హైకోర్టు వరకు వెళ్లింది.

రాంబిల్లి (అచ్యుతాపురం): రాంబిల్లి మండలంలోని పైడమ్మ చెరువు హక్కుల విషయంపై రగులుతున్న వివాదం ముదురు పాకానపడుతోంది. ఇప్పటికే ఈ చెరువుపై పట్టు సాధించేందుకు నేవల్ బేస్ ప్రయత్నిస్తుండగా, చెరువు పరిధిలో ఉన్న రెండు గ్రామాల మత్స్యకార ప్రతినిధులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ చెరువు చుట్టూ నేవల్ బేస్ చేపట్టిన ఫెన్సింగ్ పనుల్ని నిలిపివేయాలని కొత్తపేట సర్పంచ్ ఇప్పటికే హైకోర్టును ఆశ్రయించగా, తాజాగా వాడనర్సాపురానికి చెందిన మత్స్యకార ప్రతినిధులు హైకోర్టుకు వెళ్లారు. అత్యంత సున్నితమైన సమస్యగా మారిన ఈ చెరువు నేవల్ బేస్ ప్రధాన గేట్‌కు ఎదురుగా ఉంది. ఇదే చెరువు చుట్టూ ఉన్న ప్రధాన గ్రామాల్లో వాడనర్సాపురం, కొత్తపేటలు ఉన్నాయి. సుమారు 130 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువులో 30 ఎకరాల వరకూ ఆక్రమణలు, పట్టాల పంపిణీ జరిగింది. మిగిలిన చెరువులో మత్స్యకారులు దశాబ్దాల తరబడి చేపల వేట సాగిస్తున్నారు. స్థానికంగా పెంచే పశువులకు గడ్డి, నీటి వసతికి ఇది ఆసరాగా ఉంది. అయితే వాడనర్సాపురం ఎదురుగా ఉన్న ఈ చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేస్తే నేవల్ బేస్‌కు మరింత ఆకర్షణతోపాటు, నీటి వనరుగా మారుతుందనే యోచనతో గతంలో స్థానిక పంచాయతీల ప్రత్యక్ష ఆమోదం లేకుండానే అప్పటి రెవెన్యూ అధికారులు నేవల్ బేస్‌కు దఖలు పరిచారు. దీనిని ఆసరాగా తీసుకున్న నేవల్ బేస్ అధికారులు చెరువుపై పట్టు సాధించేందుకు ఇటీవల కాలంలో ఫెన్సింగ్ వేయాలని నిర్ణయించారు. పనులు ప్రారంభించిన ప్రతిసారి మత్స్యకారులు వెళ్లి అడ్డుకోవడం, అధికారులు సర్దిచెప్పడం షరా మామూలుగా మారింది. నేవల్ బేస్ వచ్చిన తర్వాత సముద్రంపైనా, శారద నదిపైనా పట్టు కోల్పోయిన ఈ ప్రాంత మత్స్యకారులకు ఏకైక చేపల వేట వనరుగా పైడమ్మ చెరువు మిగిలింది. నేవల్ బేస్ ప్రభావిత గ్రామాల్లో కొత్తపేట, వాడనర్సాపురంతో పాటు ఏడు మత్స్యకార పల్లెలు ప్రధానంగా పైడమ్మ చెరువుపై ఆధారపడి ఉన్నాయి. తమ గ్రామాలను తరలించక తప్పని పరిస్థితి వస్తే.. ఆ తర్వాతే చెరువును నేవీకి అప్పగించాలని, తమకు ఆసరాగా ఉన్న పైడమ్మ చెరువు విషయంలో ఏ మాత్రం జోక్యం చేసుకోవద్దని నేవల్ బేస్ అధికారులకు మత్స్యకారులు మొర పెట్టుకుంటున్నారు. మరోపక్క తమకు న్యాయం చేయమని కొత్తపేట, వాడనర్సాపురం వాసులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యాలు త్వరలో విచారణకు రానున్నాయి.

స్వేచ్ఛ కోల్పోయిన మత్స్యకారులు

అచ్యుతాపురం సెజ్‌తోపాటు బార్క్, నేవల్ బేస్ ఏర్పాటవుతున్న నేపథ్యంలో అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లోని తంతడి, పూడిమడక, వాడరాంబిల్లి, వాడనర్సాపురం, కొత్తపట్నం గ్రామాల మత్స్యకారులు సముద్రంపై పట్టు కోల్పోయారు. ఇటీవల కాలంలో వాడనర్సాపురానికి చెందిన వృద్ధ మత్స్యకారులు తీరంలో ఉన్న షెల్టర్‌లో పగలంతా కాలక్షేపం చేసి రాత్రి వేళ ఇంటికి పరిమితం అవుతున్నారు. పూడిమడకలో ఉప్పుటేరు కలుషితం అవుతుండగా, ఉప్పుగల్లీ భూముల బదలాయింపు ప్రక్రియకు రెవెన్యూ అధికారులు పూనుకున్నారు. ఇక వాడనర్సాపురం, కొత్తపేట మత్స్యకారులు తమకు స్వేచ్ఛ పోయిందని, ఒకప్పుడు ఎక్కడ పడితే అక్కడకు వెళ్లగలిగే తమకు అడుగడుగునా ఆంక్షలు ఎదురవుతున్నాయని కన్నీరు పెడుతున్నారు. పరిశుద్ధంగా ఉండే ఉప్పుటేరు కలుషితం కావడం, చెరువుల చుట్టూ ఫెన్సింగ్ వేయాలని అధికారులు ప్రయత్నించడం పట్ల వారు వేదన చెందుతున్నారు. పాలకులు, అధికారులు అండగా నిలవకపోవడంతో కోర్టులను ఆశ్రయించాల్సిన స్థితికి చేరామని వాపోతున్నారు. ప్రజల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు పరిశ్రమలు అవసరమే అయినప్పటికీ వారి ఉనికికి భంగం కలిగించే నిర్ణయాలు తీసుకునేటప్పుడు స్థానికుల ప్రయోజనాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరముంది.



వాడనర్సాపురం తీరంలో షెల్టర్ కింద వలలపై దిగులుగా కూర్చున్న వృద్ధ మత్స్యకారులు

గ్రామాలను తరలించిన తర్వాతే..



మా తాతల కాలం నుంచి పైడమ్మ చెరువు మీద ఆధారపడి జీవిస్తున్నాం. చేపల వేటతోపాటు మా పశువులకు కూడా ఆ చెరువే ఆధారం. ఒకప్పుడు సముద్రంలో వేటకు వెళ్లేందుకు అవకాశం ఉండేది. శారద నదిలోకి వెళ్లేందుకు ఉన్న అవకాశాన్ని అడ్డుకునేలా నేవల్ బేస్ వారు గోడలు కట్టారు. ఇప్పుడు మిగిలిన ఆధారం పైడమ్మ చెరువు. దీని చుట్టూ కూడా ఫెన్సింగ్ వేస్తే మా బతుకు తెరువు ఎలా చెప్పండి. మా గ్రామాలను తరలించిన తర్వాతే చెరువు విషయంలో నిర్ణయం తీసుకోండి.

–మెరుగు నూకరాజు, వాడనరసాపురం

చెరువే ఆధారం



మా బతుకుతెరువు పోతోంది. సముద్రంలోకి వేటకు వెళ్తే చనిపోతున్నాం. ఆ పక్కన నిర్మిస్తున్న ఒక నిర్మాణం వల్ల మాకు ఈ గతి పట్టింది. శారద నదిలోకి ఎలాగూ వెళ్లలేకపోతున్నాం. గ్రామం ఉన్నంతకాలం చెరువే ఆధారం. మా బాధను కూడా అర్థం చేసుకోండి. మేమెలా బతుకుతామో ఆలోచించండి.

–పైడిరాజు, వాడనరసాపురం

వజ్ర కవచధర గోవిందా..



కశింకోటలో వజ్ర కవచాలంకృతునిగా ధ్యాన వేంకటేశ్వరస్వామి

కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామిని శనివారం వజ్ర కవచాలంకృతుని చేసి, పూల మాలలు, తులసీ మాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. నక్షత్ర హారతి ఇచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించారు. ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అలాగే గవరపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా అర్చకుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

క్లుప్తంగా

బేస్‌బాల్ పోటీల్లో సత్తా చాటిన నర్సీపట్నం విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నర్సీపట్నం: జిల్లాస్థాయి బేస్‌బాల్ పోటీల్లో పట్టణంలోని బలిఘట్టం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలు పరవాడలో జరిగాయి. ఈ పోటీల్లో అండర్ -17 విభాగంలో బాలికల నుంచి ఎ.లలిత, బాలుర నుంచి విన్సెంట్, విజయ్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. వీరికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు నాగేశ్వరరావును, ఎంపికైన విద్యార్థులను పాఠశాల హెచ్ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి బేస్‌బాల్-14 ఎంపిక బాలిక మైత్రితో హెచ్ఎం, వ్యాయామ ఉపాధ్యాయుడు

గొలుగొండ: రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ టోర్నమెంట్‌కు మండలంలో చీడిగుమ్మల జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని జి. మైత్రి ఎంపికైంది. అండర్-14 జట్టుకు రాష్ట్రస్థాయి ఎంపిక కావడంపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. భీమిలిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆమె పాల్గొంటుందని పీడీ సుమన్, హెచ్ఎం ఆనందరావు తెలిపారు. పోటీల్లో మైత్రి మంచి ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ మృతి



మృతురాలు సుందరి

కోటవురట్ల: పురుగుమందు తాగిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాలివి. గొట్టివాడ శివారు అణుకు గిరిజన గ్రామానికి చెందిన గెమ్మెలి సుందరి(29) ఈ నెల 16వ తేదీన భర్త కామేష్ మందలించడంతో ఇంటికి సమీపంలో ఉన్న జీడితోటలోకి వెళ్లి పురుగు మందు తాగింది. అపస్మారక స్థితిలో ఉన్న సుందరిని మండల కేంద్రంలోని సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో అదేరోజున విశాఖ కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. భర్త కామేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలి

- మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి
- విద్యార్థులతో యూపీ అదనపు డీజీపీ సత్యనారాయణ



హాజరైన వివిధ కళాశాలల విద్యార్థిని, విద్యార్థులు



యూపీ అదనపు డీజీపీ సత్యనారాయణకు జ్ఞాపికను అందజేసి సన్మానిస్తున్న డీఐజీ గోపీనాథ్ జట్టి, ఎస్పీ తుహిన్ సిన్హా

నర్సీపట్నం: భవిష్యత్తులో స్థిరపడేందుకు విద్యార్థి దశలోనే లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని ఉత్తరప్రదేశ్ అదనపు డీజీపీ కిల్లాడ సత్యనారాయణ పేర్కొన్నారు. మాదకద్రవ్యాలను సంకల్పంతో నియంత్రిద్దాం అనే అంశంపై పోలీసుశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అదనపు డీజీపీ సత్యనారాయణ, విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి, ఎస్పీ తుహిన్‌సిన్హా హాజరయ్యారు. అదనపు డీజీపీ మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాల ప్రభావానికి లోనుకాకుండా, తమ భవిష్యత్తును సక్రమంగా నిర్మించుకోవాలన్నారు. వేమన పద్యాన్ని ఉదహరిస్తూ విద్యార్థులు సమాజంలో మంచిస్థానాన్ని సంపాదించుకోవాలన్నారు. డీఐజీ గోపీనాథ్ జట్టి మాట్లాడుతూ యువతను మాదకద్రవ్యాలకు ఆకర్షితులు కాకుండా చేయడమే సంకల్పం ప్రధాన ఉద్దేశమన్నారు. ప్రభుత్వం రూపొందించిన ప్రణాళికలో భాగంగా ఐదు జిల్లాల్లో మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసులు విస్తృత చర్యలు చేపడుతున్నారన్నారు. డ్రగ్స్ మాత్రమే కాదు, సైబర్ నేరాలు, సోషల్ మీడియా నేరాలు, మహిళలపై అఘాయిత్యాలు కూడా పెరుగుతున్న నేపథ్యంలో పోలీసుల నైపుణ్యాలను పెంచుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. డిజిటల్ అరెస్టు, ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్ పేరుతో వచ్చే కాల్స్‌ను ఎవరూ నమ్మవద్దని, అటువంటి కాల్స్ వచ్చినప్పుడు 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎస్పీ తుహిన్‌సిన్హా మాట్లాడుతూ ఒకసారి డ్రగ్స్‌ను వాడితే ఏమీ కాదన్న అపోహలో పడకూడదని, అలవాటు బారిన పడినవారు డబ్బుల కోసం చిన్న చిన్న నేరాలకు పాల్పడి, చివరికి నేరస్థులుగా మారుతున్న వాస్తవాన్ని తెలియజేశారు. హత్యా నేరానికి 14 ఏళ్ల జైలుశిక్ష విధిస్తే, గంజాయి కేసుల్లో 20 ఏళ్ల వరకు శిక్ష ఉంటుందన్నారు. అలవాటు బారిన పడిన వారు సంకోచం లేకుండా డీ-అడిక్షన్ సెంటర్లలో చికిత్స పొందాలని సూచించారు. ఏరియా ఆస్పత్రి వైద్యాధికారి ఎల్.పరమేశ్వరి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం అదనపు డీజీపీ సత్యనారాయణను డీఐజీ, ఎస్పీ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐలు గోవిందరావు, ఎల్.రేవతమ్మ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఏడో రోజుకు మత్స్యకారుల దీక్షలు



మోకాళ్లపై కూర్చొని నిరాహారదీక్ష చేస్తున్న మత్స్యకారులు

నక్కపల్లి: బల్క్ డ్రగ్‌పార్క్ రద్దు చేయాలంటూ రాజయ్యపేట మత్స్యకారులు చేస్తున్న నిరాహార దీక్ష ఏడోరోజుకు చేరుకుంది. శనివారం మత్స్యకారుల ఆందోళనకు జాతీయ మత్స్యకార సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మోసా అప్పలరాజు సంఘీభావం ప్రకటించారు. ప్రాణభయంతోనే రాజయ్యపేటలో అన్ని సామాజిక వర్గాల వారు బల్క్ డ్రగ్‌పార్క్‌ను వ్యతిరేకిస్తున్నారన్నారు. బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటయితే పదుల సంఖ్యలో రసాయన పరిశ్రమలు ఏర్పాటవుతాయని పరిసర ప్రాంతాలన్నీ వాయు, జలకాలుష్యానికి గురవుతాయన్నారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న గంగపుత్రుల గోడు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. మత్స్యకార నాయకులు ఎరిపిల్లి నాగేశు, మహేష్, కాశీరావు, తాతీలు, కాసులమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం దిగి వచ్చేవరకు ఉద్యమం ఆగదన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను బల్క్ డ్రగ్ పార్క్ రద్దు చేయాల్సిందేనన్నారు. ఈ సందర్భంగా మత్స్యకారులు ప్లకార్డులు పట్టుకుని మోకాళ్లపై నిలుచుని నిరసన తెలియజేశారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు అప్పలరాజు మాట్లాడుతూ ప్రభుత్వం మత్స్యకారులను చిన్నచూపు చూస్తోందన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకుంటోందని, రెండు వేల మెజార్టీ ఇచ్చిన రాజయ్యపేట మత్స్యకారులకు ప్రాణాలను తీసే పరిశ్రమలు ఏర్పాటు చేసి రుణం తీర్చుకుంటోందన్నారు. నిరాహారదీక్షపై హోంమంత్రి అనిత ఇప్పటివరకు స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.రాజేష్ పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలల అథ్లెటిక్స్, రగ్బీ పోటీలు ప్రారంభం



ఏఎంఏఎల్ కళాశాలలో అథ్లెటిక్స్, రగ్బీ పోటీల ప్రారంభోత్సవంలో క్రీడాకారులు, నిర్వాహకులు

తుమ్మపాల: మండలంలో ఏఎంఏఎల్ కళాశాలలో ఉమ్మడి జిల్లా జూనియర్ కళాశాలల అథ్లెటిక్స్, రగ్బీ, పోటీలను కళాశాల అధ్యక్షులు శ్రీధరాల కృష్ణ పేరాజు, కరస్పాండెంట్ పెంటకోట వెంకటరామారావు శనివారం ప్రారంభించారు. కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన 100మీ., 200మీ., 400మీ., 800మీ., 1500మీ., 3,4,6 కిలోమీటర్లు, షాట్ పుట్, డిస్కస్ త్రో, జావలిన్ త్రో, లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్, హైజంప్, రగ్బీ పోటీల్లో అండర్ 19 విభాగంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో వివిధ కళాశాలల క్రీడాకారులు తలపడ్డారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను విశాఖ జిల్లా అథ్లెటిక్ అండర్ -19 జట్టుకు ఎంపిక చేసి త్వరలో ఏలూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయబాబు, ఎం.వినోద్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో అండర్-19 విశాఖ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ వీపీ పుష్పలత, వైస్ ప్రిన్సిపాల్ టి.నిరంజన్ కుమార్, సూపరింటెండెంట్ పి.అనురాధ, స్పోర్ట్స్ కమిటీ సభ్యులు వాసిరెడ్డి బాలకృష్ణ, కె.రవీంద్ర, యు.కృష్ణకిషోర్, పి.వి. సుధాకర్, ఫిజికల్ డైరెక్టర్లు శ్రీలక్ష్మి, ఉమ, సాగర్, తరుణ్, ప్రసాద్, సావిత్రి, డాక్టర్ కె.వి.ఎస్ నాయుడు, కె.శత్రుఘ్న పాల్గొన్నారు.

'కొత్త పే స్కేల్ అమలు చేయాలి'

అనకాపల్లి: బ్రిటిష్ కాలం నుంచి గ్రామ రెవెన్యూ సహాయకులుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ టి.త్రినాథ్ అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శనివారం వీఆర్ఏల జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేశారని, మన రాష్ట్రంలో కూడా కొత్త పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీఆర్వోలకు వీఆర్ఏలుగా పదోన్నతులు కల్పించాలన్నారు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు త్వరలో మండల స్థాయిలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

శివారు ఆయకట్టుకు సైతం సాగునీరు అందిస్తాం

తాండవ ప్రాజెక్టు డీఈ అనురాధ



నీటిని విడుదల చేస్తున్న తాండవ ప్రాజెక్టు డీఈ అనురాధ, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ సత్యనారాయణ తదితరులు

నాతవరం: నిమ్మకట్టు ఆనకట్ట పరిధిలో ఉన్న శివారు ఆయకట్టుకు సైతం ఖరీఫ్ పంటకు పుష్కలంగా సాగు నీరు సరఫరా చేస్తామని తాండవ ప్రాజెక్టు డీఈ అనురాధ అన్నారు. రాజుపేట అగ్రహారం గ్రామ సమీపంలో తాండవ నదిలో నిర్మించిన నిమ్మకట్టు ఆనకట్టకు శిథిలమైన ప్రధాన గేట్లు రూ.7లక్షలతో ఏర్పాటు చేశారు. ఆ గేట్లను శనివారం తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కె.సత్యనారాయణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిథిలమైన గేట్ల స్థానంలో కొత్తగా ఏడు గేట్లు ఏర్పాటు చేశామన్నారు. కొత్త గేట్ల ఏర్పాటుతో లీకేజీ నీరు వృథాగా కాకుండా నిల్వ ఉంటుందన్నారు. ఖరీఫ్ పంటకు శివారు భూములకు సైతం పుష్కలంగా సరఫరా చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తాండవ ప్రాజెక్టు వైస్ చైర్మన్ జోగుబాబు, డీసీ మెంబరు పారుపల్లి దాసు, నీటి సంఘం అధ్యక్షుడు అప్పన దివాణం, ప్రాజెక్టు జేఈ శ్యామ్‌కుమార్, గన్నవరం పీఏసీఎస్ పర్సన్ ఇంచార్జి సింగంపల్లి సన్యాసిదేముడు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు అప్పారావు, నాగబాబు పాల్గొన్నారు.

పి4 విజయవంతం చేయాలి

సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ విజయకృష్ణన్

తుమ్మపాల: గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు పి4 కార్యక్రమంలో బంగారు కుటుంబాలకు, మార్గదర్శులకు సంధానకర్తలుగా పనిచేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. స్థానిక ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో పేదరికం లేని సమాజం పి4 కార్యక్రమంపై గ్రామ వార్డు సచివాలయ సిబ్బందికి నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె విచ్చేసి పలు సూచనలు చేశారు. పి4 విజయవంతం చేయడంలో గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులదే కీలక పాత్ర అన్నారు. ప్రభుత్వం రూపొందించిన యాప్ ద్వారా పి4 కార్యక్రమానికి అర్హత కలిగిన కుటుంబాలను గుర్తించి, వారిని మార్గదర్శులతో మ్యాపింగు చేయాలన్నారు. మార్గదర్శులు, బంగారు కుటుంబాలతో సమావేశం ఏర్పాటు చేయాలని, బంగారు కుటుంబాల అవసరాలు గుర్తించి వాటిని తీర్చగల మార్గదర్శులకు వారిని అనుసంధానం చేయాలన్నారు మార్గదర్శులుగా ఎవరైనా స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావచ్చన్నారు. కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి జి.రామారావు, గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం



ఎస్పీ కార్యాలయంలో పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న పోలీసు సిబ్బంది

అనకాపల్లి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా వర్షాకాలంలో వరదలు, అంటువ్యాధులపై ప్రతి వ్యక్తి అవగాహన కలిగి ఉండాలని అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్ అన్నారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో పరిసరాలను పరిశుభ్రం కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలు వివిధ రకాలైన అంటు వ్యాధుల బారిన పడకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. శుద్ధి, వేడిచేసిన నీటిని మాత్రమే తాగాలన్నారు. దోమల పెరుగుదలకు కారణమయ్యే నిల్వ నీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని కోరారు. స్టేషన్లలో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించగా, వరదల ప్రభావం తగ్గించే చర్యలు, అంటువ్యాధుల నివారణ, ఫాగింగ్ వంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని పిలుపునిచ్చారు. సీఐలు టి.లక్ష్మి, బెండి వెంకటరావు, రమేష్, ఎస్ఐలు సురేష్ బాబు, వెంకన్న, మల్లేశ్వరరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులను కొట్టిన స్కూల్ కరస్పాండెంట్‌పై కేసు



విద్యార్థులు పవన్‌కృష్ణ, షణ్ముఖసాయి రాజ్

అనకాపల్లి: స్థానిక గాంధీనగరం సాయి శక్తి ప్రైవేట్ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు బొబ్బిలి పవన్‌కృష్ణ, ఆకాశపు షణ్ముఖసాయి రాజ్‌లను హైస్కూల్ కరస్పాండెంట్ అన్నం రాజశేఖర్ శుక్రవారం మధ్యాహ్నం పాఠశాలలో ఇద్దరు విద్యార్థులను ఇనుప స్కేల్‌తో వీపుపై తట్టు వచ్చే విధంగా కొట్టారు. ఈ విషయాన్ని విద్యార్థులు సాయంత్రం ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు తట్టులను చూపించగా కుటుంబ సభ్యులు శనివారం ఉదయం పాఠశాలకు వచ్చి అడుగుతున్న సమయంలో కరస్పాండెంట్ అక్కడ నుంచి పరారయ్యాడు. సంఘటనా స్థలానికి డీఈవో గిడ్డి అప్పారావు నాయుడు చేరుకుని స్కూల్‌కు షోకాజ్ నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను కొట్టడం చట్టనిత్య నేరమని, ప్రభుత్వ పరంగా స్కూల్‌పై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. విద్యార్థి తల్లిదండ్రులు అనకాపల్లి పట్టణ పోలీస్ స్టేషన్‌లో సాయిశక్తి హైస్కూల్‌పై, కరస్పాండెంట్ అన్నంరాజశేఖర్‌పై కేసు పెట్టారు.

పచ్చ'ధనం'తో ఆరోగ్యం, ఆహ్లాదం

- ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి
- కలెక్టర్ విజయ కృష్ణన్



కలెక్టరేట్ ప్రాంగణంలో మొక్క నాటుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని మొక్కలు నాటాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మొక్కలు నాటి ప్రకృతి, పచ్చదనం ప్రాముఖ్యత గురించి వివరించారు. ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ శాఖలు విస్తృతంగా మొక్కలు నాటించాలన్నారు. అవకాశమున్న ప్రతి ఇంటిలో పెరటి తోటలు పెంచుకోవడం ద్వారా తాజా కూరగాయలు పొందవచ్చునన్నారు. అంతకు ముందు గొలగాం గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి మొక్కలు నాటారు. మహాత్మగాంధీ చిత్రపటానికి పూలమాల వేశారు. ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి, సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, పరిపాలనాధికారి విజయకుమార్, మండల ప్రత్యేక అధికారి ఎస్.వి.ఎస్.సుబ్బలక్ష్మి, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి ఇ.సందీప్, మండల అభివృద్ధి అధికారి పి.ఆశాజ్యోతి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు అల్లూరి



నర్సీపట్నంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఐజీ గోపీనాథ్ జట్టి

గొలుగొండ: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాటం చేసిన ప్రాంతంలో ఆయన విగ్రహానికి నివాళులు అర్పించడం చాలా ఆనందంగా ఉందని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి అన్నారు. ఆయన గొలుగొండ మండలం కృష్ణదేవిపేట (ఏఎల్‌పురం) గ్రామంలో పోలీస్-ప్రజలు నడుపుతున్న అల్లూరి సీతారామరాజు మైత్రి గ్రంథాలయాన్ని సందర్శించారు. మైత్రి గ్రంథాయం వద్ద ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. లైబ్రరీలో కంప్యూటర్ రూమ్‌ను ప్రారంభించారు. హైస్కూల్ విద్యార్థులకు విలువైన పుస్తకాలు అందజేశారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే యువత అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ అల్లూరి పేరున పోలీసులు, ప్రజలు మైత్రి గ్రంథాలయం నడపడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ ఈ గ్రంథాలయంలో చదువుకొని పలువురు మంచి ఉద్యోగాలు పొందడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఆర్‌జేడీ విజయ్ భాస్కర్, మైత్రి గ్రంథాలయ వ్యవస్థాపకులు శర్మ, పూర్వపు కొయ్యూరు సీఐ సోమశేఖర్, నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐ రేవతమ్మ, పూర్వపు కృష్ణదేవిపేట ఎస్ఐ తారకేశ్వరరావు, గొలుగొండ ఎస్ఐ రామారావు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, స్థానిక సర్పంచ్ లోచల సుజాతతోపాటు అల్లూరి మైత్రి గ్రంథాలయ సభ్యులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం వరకు సైకిల్ ర్యాలీ

నర్సీపట్నం: విశాఖ రేంజ్ పరిధిలో గంజాయి నేరస్థులకు సంబంధించి సుమారు రూ.14 కోట్ల విలువైన ఆస్తులను సీజ్ చేశామని డీఐజీ గోపీనాథ్ జట్టి పేర్కొన్నారు. రేంజ్‌లో 85 మందిపై మాదకద్రవ్యాల కేసు నమోదు చేశామన్నారు. వీరిలో 14 మంది ఆస్తులు సీజ్ చేసినట్లు చెప్పారు. శనివారం నర్సీపట్నంలో విలేకరులతో మాట్లాడుతూ డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఉత్తరాంధ్ర ముఖద్వారమైన పాయకరావుపేట నుంచి రాష్ట్ర సరిహద్దు ఇచ్ఛాపురం వరకు సైకిల్ యాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. యాత్ర పొడువున విద్యార్థులు, యువతను కలిసి గంజాయి వలన కలిగే అనర్థాలను వివరిస్తామన్నారు. అనంతరం రూరల్ పోలీసు స్టేషన్, నర్సీపట్నం సర్కిల్ కార్యాలయాన్ని డీఐజీ తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు.

బలవంతపు భూసేకరణ నిలిపివేయాలి



విలేకర్లతో మాట్లాడుతున్న వెంకన్న

దేవరాపల్లి: జిల్లాలో బలవంతపు భూసేకరణను నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24న రైతులు, కూలీలు తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వెంకన్న కోరారు. దేవరాపల్లిలో శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి పేరిట 2013 భూసేకరణ చట్టాన్ని తుంగలోకి తొక్కి పోలీసులు, సైన్యాన్ని ప్రయోగించి రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కోవడాన్ని వ్యతిరేకిస్తూ చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమానికి జిల్లాలో బలవంతపు భూసేకరణ జరుగుతున్న ప్రాంతాల నుంచి రైతులు, కూలీలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం గతంలో సేకరించిన భూములకు పరిహారం, పేదలకు పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో బలవంతపు భూసేకరణ చేపట్టి పోలీసులతో రైతు కూలీలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. జిల్లాలో రెండు పంటలు పండే భూములను గుంజుకొని పర్యావరణానికి హాని చేసే కంపెనీలను పెట్టేందుకు మిట్టల్, ఆదానీలకు వేల ఎకరాలను కట్టబెడుతున్నారని విమర్శించారు. బల్క్‌డ్రగ్ పార్కు, మిట్టల్ స్టీల్‌ప్లాంట్, దేవరాపల్లి మండలం చింతలపూడి పరివాహక ప్రాంతంలో అదాని హైడ్రో పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్ కోసం 820 ఎకరాలు, కె.కోటపాడు మండలంలో ఎస్ఈజెడ్ కోసం 1200 ఎకరాలు, బుచ్చెయ్యపేట మండలంలో 1691 ఎకరాల భూములను బలవంతంగా సేకరించడానికి ప్రభుత్వం సిద్ధమైందన్నారు.



అనకాపల్లిలోని ఒక పాఠశాలలో ముందస్తు దసరా సంబరాల్లో భాగంగా దుర్గాదేవి వేషధారణలో ఆకట్టుకున్న చిన్నారి
-అనకాపల్లి

సండే క్లాసిఫైడ్స్ సాక్షి

Education

HOME TUTIONS
■ ELITE Home Tutions : CBSE / ICSE / STATE 1std. to 10th & Intermediate +1, +2 All Subjects and Polytechnic best faculty is Provided. Call : 94907 69067, 93984 49274 [6810]

Real Estate

■ గాజువాక తుంగ్లాంలో ఒక పోర్షన్ ఇల్లు 28 లక్షలు. కూర్మన్నపాలెం లో 999 గజం స్థలం డెవలప్‌మెంట్‌కి, అమ్మకానికి కలదు. ఫోన్ : 73864 14017 [SCA25008320]

■ VSP, VZM వాసులకు శుభవార్త! మీ విలువైన పంచాయతీ స్థలాలు VMRDA, GVMC అప్రూవల్ చేయించుకొని విలువను 10 రెట్లు సంపాదించే అవకాశం. Ph: 96763 85022. [V- 2955]

BUILDING & CONSTRUCTION
■ LRS GVMC & VUDA Plan approvals & all type of Civil Construction works. Contact : 73864 64888 & 89198 48136 [V- 6815]

FOR SALE
■ BSNL POSTAL HOUSING SOCIETY Residential and Commercial Sites near Bengaluru International Airport. Rs:1400/- per sqft Bang on 8 Lane (330 feet Ring road) Booking Open for General public Call: 90715 34000 [QA-2295]

FLAT FOR SALE
■ 1075 Sft. 2 BHK S/F & 2150 Sft. 3 BHK S/F, 5 Yrs. Old, Cupboards, Car Parking. Lift, 24 Hrs. Water for Sale at near A.U. Womens Eng. College, Sivajipalem. Ph : 89859 89180 [V- 731]

■ Approximately 1100sft Flat No. 303 (2Bhk)at SGK Estate, Shree Complex, side of Srichaitanya College, Bhudil park hotel, Dwaraka nagar, VSP. C: 94408 78893. [SCA25008378]

■ South Face, Full Caboards Car park 3Br House Muncipal & Bore water Vivekananda nagar Yandada Petrol Bunk backside 9908420668 [SCA-25008141]

HOUSE FOR SALE
■ House For Sale : Near Lakshmipuram Village, Vepagunta, Pendurthi, 104 Sq.yds. N/F Site. Cellar + Ground Floor Construction with all amenities for sale. Ph : 96182 90374 [V- 14330]

■ Pendurthi Rajayyapeta 133 Sq.Yds East Facing New Houses for Sale. Contact : 98480 19546 [V- 2941]

PLOT FOR SALE
■ కాకినాడ పోర్టు దారిలో 100అ ఎడిబి రోడ్డు మీద 1345 చ.గ. స్థలం అమ్మకం- 9347073899 [WB-23622]

TO-LET - WANTED
■ విశాఖపట్నంలో ఉన్న జూనియర్ కాలేజ్ కి నగర పరిధిలో హాస్టల్ కోసం బిల్డింగ్ కానీ ఫ్లాట్లు కానీ లాంగ్ లీజుకు కావలెను. ఫోన్ : 99128 11990 [V- 14427]

Services

BUSINESS OFFER
■ నో పెట్టుబడి. ప్రొడక్ట్స్ మేమే పంపుతాము. మీ ఇంటి వద్దనే మా ప్రొడక్ట్స్ సేల్స్ చేయుట ద్వారా ప్రతినెలా ఆదాయం పొందండి. వ్యాపారం మేమే నేర్పుతాము. ✆ 83175 28192 [B-1259]

తాజా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com

■ మీరు చెప్పుకోలేనంత ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారా? మీకు మీ ఆదాయం సరిపోక కొత్తగా వేరే ఉద్యోగంలోకి వెళ్లలేక సతమతమౌతున్నారా? అతి తక్కువ సమయంలో మీ ఆర్థిక ఇబ్బందులనుంచి బైట పడి మీకంటూ ఒక కారు, కొంత ఆస్తి సంపాదించుకోవాలనుకుంటున్నారా? మా రియల్‌ఎస్టేట్ సంస్థ నందు మాతో కలిసి మార్కెటింగ్ రంగంలోకి అడుగు పెట్టి పట్టుదలతో మా VMRDA / RERA అప్రూవల్ పొందిన ప్లాట్స్ సేల్ చేయండి (కమీషన్ బేసిస్)లో. పైన చెప్పినవన్నీ సాకారం చేసుకోండి. రియల్‌ఎస్టేట్ మార్కెటింగ్ ఫుల్ / పార్ట్ టైం (కమీషన్ బేసిస్‌లో) కచ్చితంగా ఎదగాలి అని పట్టుదల వున్న వారే సంప్రదించగలరు. ఫోన్ : 6392273234 [V- 1711]

GOLD LOANS
■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 14303]

OLD AGE HOME
■ Elder Home గాజువాక & అక్కయ్యపాలెం వృద్ధుల ఆశ్రమం. వృద్ధులకు మంచాన వున్న వారికి మంచి వాతావరణం, ఆరోగ్యకరమైన భోజనం 24 గం॥ వైద్యసేవలు. హోమ్‌కేర్ సర్వీస్ కలదు. ఫోన్: 87904 49799, 90108 92178 [SCA25008146]

Wanted

■ వైజాగ్‌లో 20 సం॥లు దిగ్విజయంగా కొనసాగుతున్న ప్రముఖ సంస్థకు కొత్తగా Branches ప్రారంభిస్తున్న సందర్భంగా 30 సం॥ పైబడిన M/F, House Wifes, Rtd. Persons Managers గా కావలెను. Attractive Sal + Incen. కలదు. సంప్ర : 95500 97707 [V- 314]

■ Wanted Experienced Male or Female RECEPTIONIST cum ACCOUNTANT for a Reputed Company. Ph : 92466 24406 [V- 2868]

■ ప్రముఖ సెక్యూరిటీ సంస్థనందు విశాఖపట్నం సిటీ, గాజువాక ఆటోనగర్‌లో పనిచేయుటకు అనుభవం గల 10th or above పాసైన సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. వివరాలకు సంప్రదించండి. ✆ : 95023 77757 [V- 2861]

■ Leading ISO Certified Company Want Retired Persons / House Wives. Salary / Incentives, Decide after Interview. Ph : 77807 62732 / 81792 85708 [V- 5233]

■ జీతం 20 K + సంపాదించుకొనుటకు "టెలీకాలర్స్" నలుగురు కావలెను. ఫోన్ : 63001 72408 [V- 2867]

■ విజయవాడలో A/C Rental Events కంపెనీకి డ్రైవింగ్ తెలిసిన హెల్పర్స్, A/C టెక్నీషియన్స్ కావలెను. జీతం : 20-25,000/- భో+వసతి+ఫ్రీ ట్రైనింగ్. ✆ 99660 44671 [B-1272875]

■ రామకృష్ణ గ్రూప్ (AP NO-1), VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 92814 52827, 95420 47788 [B-1280517]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

అనకాపల్లి	:9010546644
యలమంచిలి	:9951602901
చోడవరం	:9010210265
నర్సీపట్నం	:9010234557
పాడేరు	:9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

క్లుప్తంగా

పేదలకు దుస్తుల పంపిణీ



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

అనకాపల్లి టౌన్: చలనచిత్ర నటుడు దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు 102వ జయంతి వేడుకలు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం ఆధ్వర్యంలో పేదలకు దుస్తులు, కళ్లద్దాలు, మిఠాయిలు పంపిణీ చేశారు. గవరపాలెం పార్కు సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, సినీ డైరెక్టర్ ఆడారి మూర్తి, కాండ్రేగుల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న విద్యుత్ శాఖ ఉద్యోగులు

అనకాపల్లి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను అంగీకరించని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఏపీఈపీడీసీఎల్ విద్యుత్ ఉద్యోగుల సంఘం పట్టణ కార్యదర్శి నూకరాజు తెలిపారు. రాష్ట్ర వ్యాప్త విద్యుత్ ఉద్యోగుల నిరాహార దీక్షల్లో భాగంగా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద శనివారం రెండో రోజు భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులకు, పెన్షనర్లకు వారి కుటుంబ సభ్యులకు నగదు రహిత వైద్య సదుపాయం తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో విద్యుత్ శాఖ ఉద్యోగులు పడాల సోమన్నదొర, సంకర నాగరాజు, ఓలుమరక శ్రీనివాసరావు, తినాథ్ కుంచుబాబు పాల్గొన్నారు.

గురజాడకు ఘన నివాళి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ వైకుంఠరావు

అనకాపల్లి టౌన్: స్థానిక డైట్ ఇంజినీరింగ్ కళాశాలలో అభ్యుదయ పితామహుడు గురజాడ అప్పారావు జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 21న జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు, వైస్ ప్రిన్సిపాల్ జె. గణేష్ ప్రసాద్ రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురజాడ రచనలు ఈ నాటికీ ప్రజల మన్ననలను పొందుతున్నాయన్నారు. అనంతరం విద్యార్థులకు కవిత, సాహిత్యం పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ మహాజన సభ రేపు

అనకాపల్లి: స్థానిక గాంధీనగరం అన్నపూర్ణ బ్యాంక్ (తుమ్మపాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం) సంఘం మహాజన సభ ఈ నెల 22న ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు సంఘం అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి వి.వి.వి.సత్యకుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంఘ సభ్యులు అందరూ హాజరు కావాలని కోరారు.

'ప్రిన్సిపాల్‌ను కఠినంగా శిక్షించాలి'

అనకాపల్లి టౌన్: విద్యార్థులను స్టీల్ స్కేల్‌తో రక్తం చిందేలా చితకబాదిన సాయిశక్తి స్కూల్ ప్రిన్సిపాల్ రాజశేఖర్‌ను కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. స్కూలులో కనీస వసతులు కల్పించకుండా, సద్బుద్ధితో పాఠాలు చెప్పాల్సిన ప్రిన్సిపాల్ విద్యార్థులను దారుణంగా శిక్షించడం తగదన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 64 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,850	4,930
రెండో రకం	-	-
మూడోరకం	3,600	3,650

అనకాపల్లి సినిమాలు

రాజా	: భద్రకాళి
సత్యనారాయణ స్క్రీన్-1	: కిష్కింధపురి
సత్యనారాయణ స్క్రీన్-2	: టన్నెల్
పర్తిసాయి	: బ్యూటీ
షిర్డీసాయి	: కూలీ
వెంకటేశ్వర	: లిటిల్ హార్ట్స్
రామచంద్ర	: మిరాయ్

దివ్యాంగుల దీనస్థితి

- రూ.6 వేల పింఛన్ చాలక అవస్థలు
- వైద్య ఖర్చులు, మందుల కోసం అప్పుల పాలు
- మెడికల్ పెన్షన్ రూ.15 వేలకు పెంచని ప్రభుత్వం
- ఎన్నికల ముందు హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబు



దివ్యాంగురాలు లంకలపల్లి కమల పద్మజకు ఏడాది క్రితం సదరం క్యాంపులో ఇచ్చిన సర్టిఫికెట్

అనకాపల్లి: మెడికల్ పెన్షన్ రూ.5 వేలు ఏ మూలకు సరిపోతాయని గత ప్రభుత్వంపై అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత సీఎం చంద్రబాబు విమర్శలు చేశారు. తాము అధికారంలోకి రాగానే 85 శాతం వైకల్యం కలిగిన వారికి రూ.15 వేలకు పెంచుతామని సార్వత్రిక ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా దాని ఊసేలేదు. ప్రస్తుతం ఇస్తున్న రూ.6 వేల పింఛన్‌తో కనీస అవసరాలు తీరడం లేదని అచేతన రోగులు, దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్య ఖర్చులు, మందుల కోసం అప్పులు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. వాస్తవానికి అంగవైకల్యంలో పలు రకాల కేటగిరీలు ఉన్నాయి. వీటిలో ప్రధానంగా అంగ వైకల్యం, మానసిక వైకల్యం, అంధులు, బధిరుల జీవనం దయనీయంగా ఉంటోంది. వీరిలో కొంతమందికి అవయవాల లోపం ఉన్నప్పటికీ, ఇతర ఉపకరణాల సహకారంతో జీవనం సాగిస్తారు. ఈ అంగ వైకల్యంలో బహుళ వైకల్యంతోపాటు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారి పరిస్థితి వర్ణనాతీతం. పోలియో లేదా పక్షవాతం, యాక్సిడెంట్ కేసులు, కిడ్నీ, కాలేయ వ్యాధులు, తీవ్రమైన కండరాల వ్యాధులు, మస్క్యులర్ డిస్ట్రోఫీ లాంటి దీర్ఘకాలిక వ్యాధులతో మంచానికే పరిమితమై బాధపడేవారు ఉన్నారు. నిత్యం నరకం చూస్తూ.. కొన్ని సందర్భాల్లో కారుణ్య మరణాలకూ కోర్టులను ఆశ్రయించిన దాఖలాలు కూడా ఉన్నాయి. ఇటువంటి దివ్యాంగుల కోసం గత ప్రభుత్వంలో డీఎంహెచ్‌వో మంజూరు చేసిన సదరం సర్టిఫికెట్ల ఆధారంగా పెన్షన్లు అందించేవారు. సాధారణ దివ్యాంగులకు రూ.3 వేలు ఉంటే, 80 శాతంపైగా వైకల్యం ఉంటే మెడికల్ పెన్షన్ రూ.5 వేలు ఇచ్చేవారు. వీటితో మెడిసిన్ ఖర్చులకు, జీవన భృతికి ఎంతో కొంత ఊరట ఉండేది.



దివ్యాంగుల పింఛన్ నెలకు రూ.15 వేలు అమలు చేయాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న పాత్రపల్లి వీరుయాదవ్(ఫైల్)

మెడికల్ పెన్షన్ల కోసం తిప్పలు

మెడికల్ పెన్షన్లు పొందడానికి ఎన్నో వ్యయప్రయాసలు పడే పరిస్థితి నిస్సహాయులైన దివ్యాంగులకు ఉంది. ప్రస్తుత డిజిటల్ రంగంలో మాన్యువల్ విధానానికి కూటమి ప్రభుత్వం స్వస్తి పలకడంతో దివ్యాంగులకు తిప్పలు తప్పడం లేదు. మారుమూల ప్రాంతాలతోపాటు ఏజెన్సీలో దివ్యాంగులు మెడికల్ పెన్షన్లకు అర్హత ఉన్నప్పటికీ పొందలేని పరిస్థితి నెలకొంది. వీరు ఇప్పటికీ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అధికారంలోకి రాగానే మెడికల్ పెన్షన్లను రూ.5 వేల నుంచి ఎన్టీఆర్ భరోసా కింద రూ.15 వేలు పెంచుతామని ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా దీని ఊసేత్తలేదు.

సదరం సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌తో సరి

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఐదు మాసాలు తర్వాత మెడికల్ పెన్షన్ల ప్రక్రియ ఏర్పాటు చేసింది. ఎన్టీఆర్ క్రీడా మైదానంలో కొత్తగా సదరం శిబిరాలు ఏర్పాటు చేసింది. జిల్లాలో వంద శాతం అంగవైకల్యం కలవారు తమ కుటుంబ సభ్యులు సహాయంతో వచ్చి కొత్తగా సదరం సర్టిఫికెట్లు చేయించుకున్నారు. అసలు ఈ క్యాంపులు ఎందుకు నిర్వహించిందో దివ్యాంగులకు అర్థంకాని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిస్సహాయులైన దివ్యాంగులకు రూ.15 వేల పింఛన్ ఇవ్వాలని కోరుతున్నారు.

మెడికల్ పెన్షన్ అమలు చేయాలి



నేను వంద శాతం అంగవైకల్యంతో బాధపడుతున్నాను. ఐదు సంవత్సరాల నుంచి ఎన్నోసార్లు మెడికల్ పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నాను. సుమారుగా ఏడాది క్రితం ఎన్టీఆర్ క్రీడా మైదానంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సదరన్ క్యాంపులో చూపించుకున్నాను. నేటి వరకూ మెడికల్ పెన్షన్ మంజూరు చేయలేదు.

– బొట్టా సంతోష్, శారదానగర్, అనకాపల్లి

90 శాతం దివ్యాంగుడిని



నేను 90 శాతం దివ్యాంగుడ్ని, ఎన్టీఆర్ భరోసా పింఛన్‌కు దరఖాస్తు చేసుకున్నాను. నేటి వరకూ మెడికల్ పెన్షన్ ఇవ్వలేదు. దాంతో వైద్య ఖర్చులు, మందుల కోసం అప్పులు చేయాల్సి వస్తోంది. మెడికల్ పెన్షన్ కోసం ఎప్పుడిస్తారో ప్రభుత్వమే సమాధానం చెప్పాలి.

– బానోది దిలీప్, ఊడేరు గ్రామం, అనకాపల్లి మండలం

రూ.15 వేల పింఛన్ ఎప్పుడిస్తారు?



ప్రస్తుతం నాకు దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలు వస్తోంది. నేను 20 సంవత్సరాలుగా కండరాల సమస్యతో బాధపడుతున్నాను. ఎటూ కదలలేను. ఎన్టీఆర్ మెడికల్ పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నాను. ఏడాది క్రితం అనకాపల్లి ఎన్టీఆర్ క్రీడా మైదానంలో సదరం క్యాంపులో వైద్యులు మరో సారి పరీక్షలు నిర్వహించారు. అంగవైకల్యం సర్టిఫికెట్ ఇచ్చారు. ఎన్టీఆర్ భరోసా రూ.15 వేలు పెన్షన్ నేటికీ ఇవ్వలేదు. ఎప్పుడు ఇస్తారో అర్థం కావడం లేదు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగలేకపోతున్నాం.

– లంకలపల్లి పద్మజ, కె.ఎస్.ఆర్.పేట, అనకాపల్లి మండలం

వెరిఫికేషన్ కోసం మళ్లీ కేజీహెచ్‌కా..!



డీఎంహెచ్‌వో మెడికల్ సర్టిఫికెట్లు పొందిన అర్హులకు వెంటనే రూ.15 వేలు పెన్షన్ అందజేయాలి. ఏడాది కిత్రం ఎన్టీఆర్ క్రీడా మైదానంలో సదరన్ సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించి మళ్లీ కొత్త సర్టిఫికెట్లు అందజేశారు. మరోసారి వీటి వెరిఫికేషన్ నిమిత్తం మరలా కేజీహెచ్‌కు వెళ్లాలని చెప్పడం విడ్డూరంగా ఉంది. దీనిపై కలెక్టర్, ఆరోగ్యశాఖ మంత్రి తక్షణమే చర్యలు చేపట్టాలి.

– పాత్రపలి వీరుయాదవ్, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు, అనకాపల్లి

ప్రజలకు అందుబాటులో సేంద్రియ ఉత్పత్తులు



మాట్లాడుతున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లచ్చన్న

అనకాపల్లి: ప్రకృతి వ్యవసాయం విధానంలో పండించిన ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులో తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నట్టు ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సీహెచ్ లచ్చన్న తెలిపారు. స్థానిక రింగ్‌రోడ్డులోని ప్రకృతి వ్యవసాయ జిల్లా కార్యాలయంలో శనివారం జిల్లాలో వివిధ మండలాల మార్కెటింగ్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై ప్రజలకు అవగాహన పెరుగుతుందన్నారు.

ప్రధానంగా మండల, ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం, కలెక్టర్ కార్యాలయాల్లోకి నిత్యం ప్రకృతి వ్యవసాయంతో పండించిన ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. ఈ నెల 22న గుంటూరు రైతు నేస్తం ఫౌండేషన్‌లో మూడు రోజులు అగ్రికేటర్లకు శిక్షణ ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయ మార్కెటింగ్ జిల్లా కో ఆర్డినేటర్ వర్మ, జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ గోవింద్, జిల్లా మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ శిరసపల్లి అప్పలరాజు, సిబ్బంది శివ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో హైమావతి

అనకాపల్లి: ప్రజలు వ్యాధులు బారిన పడకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీసీహెచ్ఎస్ ఎస్.శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో ఎం.హైమావతి తెలిపారు. శనివారం స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి ఆవరణలో డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జన్మించిన ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా జీవించాలంటే మొక్కలను నాటి వాటి పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రకృతి వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. రహదారులపై చెత్తాచెదారం వేయడం వల్ల వ్యాధులు బారినపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. వాతావరణంలో మార్పులు, వర్షాలు పడుతున్న తరణంలో ప్రజలు వ్యాధులు బారిన పడే అవకాశం ఉందని, స్వచ్ఛమైన వేడినీటి తాగాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌వో ఆర్.రామ చంద్రరావు, ఏఎస్‌వో వీరి నాయుడు, సిబ్బంది ఎస్.రమణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిళ్ల పంపిణీ



విద్యార్థులకు వాటర్ బాటిళ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

అనకాపల్లి: లక్ష్మీనారాయణ క్వారీ సంస్థ ఆధ్వర్యంలో మండలంలో మామిడిపాలెం హైస్కూల్‌లో శనివారం 600 మంది విద్యార్థులకు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీ స్టీల్ వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. ప్లాస్టిక్ వాడకం వల్ల ఇటీవల కాలంలో అనేక మంది క్యాన్సర్ వ్యాధి బారిన పడుతున్నట్లు ఆయన వాపోయారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీధర్, లక్ష్మీనారాయణ క్వారీ సంస్థ యజమాని రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

25న ప్రాంతీయ స్థాయి డాక్ అదాలత్

అనకాపల్లి: విశాఖ ఎంవీపీ బస్ కాంప్లెక్స్ ఆవరణలోని పోస్టుమాస్టర్ జనరల్ కార్యాలయంలో 119వ ప్రాంతీయ స్థాయి డాక్ అదాలత్ ఈనెల 25న ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు అనకాపల్లి పోస్టల్(తపాలా శాఖ) సూపరింటెండెంట్ సిహెచ్.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోస్టల్ సేవలకు సంబంధించిన వ్యక్తిగత, ప్రత్యేక ఫిర్యాదులను అదాలత్‌లో పరిష్కరిస్తారన్నారు.

24న విశాఖ డెయిరీ వద్ద రైతుల ధర్నా



సమావేశంలో విశాఖ డెయిరీ పాల రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు

అనకాపల్లి: ఉత్తరాంధ్రలో పాల రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ ఈ నెల 24న విశాఖ డెయిరీ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు విశాఖ డెయిరీ పాల రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ధర్నా పోస్టర్‌ను శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల జనరల్ బాడీ సమావేశంలో డెయిరీ యాజమాన్యం లీటరు పాల ధర రూ.10 పెంచాలని కోరారు. డెయిరీలో అవినీతిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో విచారణ చేసి, నిందితులను శిక్షించి, వాటి ఆస్తులను కాపాడాలన్నారు. ఇప్పటికే డెయిరీవి కోట్లాది రూపాయలు ఆస్తులు పక్కదోవ పట్టాయన్నారు. ప్రతి మూడు నెలలకు బోనస్ ఇవ్వాలని, పశువులకు ఉచిత బీమా, మందులు, దాణాపై 70శాతం సబ్సిడీ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం సూర్యనారాయణ, జిల్లా రైతు సంఘం గౌరవాధ్యక్షుడు కర్రి అప్పారావు రైతు సంఘం నాయకులు గండి నాయన బాబు, నాగిరెడ్డి సత్యనారాయణ, కొలు రైతు సంఘం నాయకుడు ఎస్.బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీకి వెదురుపర్తి విద్యార్థి

కశింకోట: మండలంలోని వెదురుపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి రాష్ట్ర స్థాయి పెన్సింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇక్కడ 9వ తరగతి చదువుతున్న వి. కిశోర్ అనకాపల్లి మండలం మార్టూరులో స్కూలు గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలో అండర్ – 14 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. హెచ్‌ఎం కె.ఆర్.ఎస్.ఎన్. నాయుడు, పీడీ సబిత, విద్యా కమిటీ చైర్మన్ జి. శివ, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు. రాష్ట్ర స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు.

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న వైద్యాధికారి యశోద

కశింకోట: మహిళలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి యశోద కోరారు. స్థానిక దేవర వీధిలో స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. 200 మంది మహిళలకు వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు బాగుంటేనే కుటుంబం బాగుంటుందన్నారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, మహిళలకు బీపీ, సుగర్, సర్వేయకల్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, ఓరల్ క్యాన్సర్, టీబీ పరీక్షలు జరిపి అవసరమైన వారికి మందులు అందజేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, ఆర్ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, మాజీ ఉప సర్పంచ్ నడిపల్లి సన్యాసిరావు, పీహెచ్ఎన్ సత్యవతి, హెల్త్ సూపర్‌వైజర్ సత్యనారాయణ, సీహెచ్‌వో హిమబిందు, ఏఎన్ఎం సింహాచలం, సిబ్బంది పాల్గొన్నారు.

కశింకోటలో వర్ష బీభత్సం

- నేల కూలిన విద్యుత్ స్తంభాలు
- అంధకారంలో పంచాయతీ



తాళ్లపాలెం కూడలిలో గతుకుల్లో చేరిన వర్షపు నీరుతో వాహన చోదకుల ఇబ్బందులు

కశింకోట: మండల కేంద్రంలో శనివారం సాయంత్రం వర్షం బీభత్సం సృష్టించింది. పలు చోట్ల విద్యుత్ స్తంభాలపై చెట్టు కొమ్మలు పడిపోయాయి. స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గ్రామం అంతటా అంధకారం అలుముకొంది. ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై పెను గాలులు వీచాయి. దీంతో స్థానిక కనక మహాలక్ష్మి ఆలయం వద్ద నాలుగు స్తంభాలు నేలకొరిగాయి. దీంతో ఆలయానికి వచ్చే రహదారి విద్యుత్ తీగలతో నిండిపోయి మూసుకుపోయింది. గవరపేట మధ్య వీధి, అగ్రహారం, శారదా నది అవతల పొలాల్లో పలుచోట్ల చెట్లు, కొమ్మలు విద్యుత్ తీగలపై పడ్డాయి. దీంతో సాయంత్రం నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాత్రి వరకు సరఫరా పునరుద్ధరణ కాలేదు. గ్రామం అంతటా అంధకారం అలుముకోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఇన్వెర్టర్లు ఉన్న వారు మినహా మిగిలిన వారంతా చీకట్లో మగ్గారు. సిబ్బంది మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. ఇక వర్షం వల్ల స్థానిక పీహెచ్‌సీకి వెళ్లే రోడ్డు, భవానీ కాలనీ, రైల్వే స్టేషన్ రోడ్ జలమయం అయ్యాయి. తాళ్లపాలెంలో భారీ వర్షం కురిసింది. అక్కడి కూడలి ప్రాంతం రోడ్డు గతుకుల్లో నీరు చేరడంతో వాహన చోదకులు ఇబ్బంది చెందారు. వర్షం ఖరీఫ్ వరి నాట్లకు బాగా ఉపకరిస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



నీటిమయంగా కశింకోట పీహెచ్‌సీ రోడ్డు



కనక మహాలక్ష్మి వీధిలో రోడ్డుపై నేల కూలిన విద్యుత్ స్తంభాలు



కశింకోటలో విద్యుత్ సరఫరా లేక అంధకారంగా ప్రధాన పంచాయతీ రహదారి

ఉత్సాహంగా దసరా సంబరాలు



దేవతామూర్తులు వేషధారణలో చిన్నారులు

అనకాపల్లి: స్థానిక ఉడ్‌పేటలోని హ్యాపీ కిడ్స్ ప్లే స్కూల్ ఆవరణలో ముందస్తుగా దసరా ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. పలువురు చిన్నారులు దుర్గాదేవి, తదితర దేవతామూర్తుల వేషధారణలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ శెట్టి గిరీష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు మన సంస్కృతీ సాంప్రదాయాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, నీటిపారుదల శాఖ విశ్రాంత ఏఈ మల్ల చిన్నారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనోత్సవం



వి స్టార్ గైస్ ఆధ్వర్యంలో వినాయక విగ్రహం ఊరేగింపు



126 అడుగుల లక్ష్మీగణపతి మండపం వద్ద భారీ అన్నసమారాధనలో భక్తులు

అనకాపల్లి: వి స్టార్ గైస్ ఆధ్వర్యంలో స్థానిక వేల్పులవీధిలో ఏర్పాటు చేసిన 36 అడుగుల భారీ గణపతి విగ్రహ నిమజ్జనోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ముందుగా ఇక్కడ ఏర్పాటు చేసిన చిన్న వినాయకుడిని పట్టణ పురవీధుల్లో ఊరేగించి, స్థానిక శారదానదిలో నిమజ్జనం చేశారు. ఊరేగింపులో తప్పెటగుళ్లు, కోలాటాలు వంటి అనేక సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వి స్టార్ గైస్ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ క్రీడా మైదానంలో...

స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో సంపత్ వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 126 అడుగుల లక్ష్మీగణపతి వినాయకుని పందిరి వద్ద ఉత్సవ కమిటీ చైర్మన్ బుద్ధ భూలోకనాయుడు ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 22న రెండు ఫైర్ ఇంజిన్ల సహాయంతో స్వామివారి నిమజ్జనోత్సవం కార్యక్రమం చేస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

విద్యార్థులకు పండగే పండగ

అనకాపల్లి/కశింకోట: పాఠశాలలకు ఈ నెల 21 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు దసరా సెలవులు ఇవ్వడంతో విద్యార్థుల్లో సందడి నెలకొంది. ఈ మేరకు కశింకోట మండలం తాళ్లపాలెం ఏపీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు, అనకాపల్లిలో గాంధీనగరం వసతి గృహ విద్యార్థులు శనివారం తమ స్వగ్రామాలకు ఉత్సాహంగా తరలివెళ్లారు. పలు చోట్ల తమ గ్రామాలకు వెళ్లడానికి తగిన బస్సులు లేకపోవడం, ఉన్నవి ఖాళీ లేక నిలపకపోవడంతో ఎక్కువ సమయం నిరీక్షించాల్సి వచ్చింది. అందరూ ఒకేసారి వెళ్లడం వల్ల రద్దీ నెలకొంది. కొందరు ఆటోల్లోను, ప్రైవేటు వాహనాల్లో తరలి వెళ్లారు.



దసరా సెలవులకు స్వగృహాలకు వెళ్తున్న వసతి గృహ విద్యార్థులు



ఆటోలో వెళుతున్న బాలికలు

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
అనకాపల్లి :
9010973030, 9010546644, 9951602901
Office mail : sakshiadvtvsp@gmail.com